క్లుప్తంగా

కోలాహలంగా గిరిప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మహిళలు

నరసరావుపేట రూరల్: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కోటప్పకొండ గిరిప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులు గిరిప్రదక్షణను ప్రారంభించారు. సోపాన మార్గంలోని విఘ్నేశ్వరుని ఆలయం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం గిరిప్రదక్షణను ప్రారంభించారు. శివనామస్మరణ చేస్తూ భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలయ అధికారులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తాగునీరు, మజ్జిగ, అల్పాహారాన్ని అందజేసారు.

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: చిలకలూరిపేట నూతన మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న షిర్డీసాయిబాబా సేవాశ్రమం ఏడో వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు యూవీ శివరామయ్య తెలిపారు. ఉదయం సుప్రభాత సేవలతో ప్రారంభమై సామూహిక సాయిసత్యవ్రతాలు, వార్షికోత్సవ కేక్ కటింగ్లు జరుగుతాయన్నారు. అనంతరం అన్నదానం, మధ్యాహ్నం స్వామివారికి గ్రామోత్సవం, పల్లకీసేవ ఉంటుందన్నారు.

వైద్యురాలు కృష్ణకుమారికి నివాళి



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన వైద్యురాలు ఎం.కృష్ణకుమారి గురువారం మృతిచెందారు. పట్టణ, గ్రామీణ ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల ఐక్యవేదిక నాయకులు ఆమె మృతదేహానికి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వినుకొండ ప్రాంత ప్రజలకు ఆమె చేసిన వైద్యసేవలను కొనియాడారు. వేదిక నాయకులు డాక్టర్ గోగినేని సాంబశివరావు, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కె.బ్రహ్మానందం, పాశం నాగమల్లేశ్వరరావు, పి.శ్రీనివాసరెడ్డి, షేక్ హుస్సేన్, డి.బి.నారాయణ, రామలింగాచారి, కృష్ణారెడ్డి తదితరులు నివాళులర్పించి ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ఈపూరు: రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయాలపాలైన సంఘటన మండలంలోని కొచ్చర్ల గ్రామంలో గురువారం జరిగింది. ఈపూరు గ్రామానికి చెందిన గోపాలుని భాస్కరరావు, భార్య శివపార్వతి ఇరువురు వినుకొండలోని ఓ ఆధ్యాత్మిక కార్యక్రమానికి బయలుదేరి ఆటోలో వెళ్తుండగా కొచ్చర్ల సమీపంలో ఆటో బోల్తా కొట్టడంతో శివపార్వతికి తీవ్రగాయాలు కాగా భాస్కరరావుకు స్వల్పగాయలయ్యాయి. ఇరువురు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రబీ పంటల పరిశీలన



ఈపూరు: మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను గుంటూరు కమిషనర్ ఆఫీస్ డీడీఏ ఎం.రత్నమంజుల గురువారం పరిశీలించారు. పంట నమోదు పరిశీలనలో రైతుల పొలాలను సందర్శించి వారు సాగు చేసిన పంటలు సరియైనవో, కావో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె పంట నమోదులో తీసుకోవాలని జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. జిల్లా వ్యవసాయ కార్యాలయ ఏడీఏ సీహెచ్ రవికుమార్, వ్యవసాయ అధికారిణి పి. అరుణచంద్ర, మండల వ్యవసాయ అధికారి ఆర్. రామారావు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు, బొమ్మరాజుపల్లి గ్రామ సర్పంచి శ్రీనివాసరావు, భద్రుపాలెం సర్పంచి పుల్లారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్‌కే.యు.సల్మా, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అల్పాహారం, పుస్తకాలు పంపిణీ



వినుకొండ టౌన్: మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ శివారులోని చెవిటి, మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలోని 80మంది చిన్నారులకు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన ఎంవీ రెడ్డి, ఆయన కుమార్తె శాంతి రెడ్డిలు పుస్తకాలు, పెన్నులు, అల్పాహారం, కాస్మొటిక్స్ గురువారం అందచేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, బీఎస్ రావు, ఎస్ఎన్ఆర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

కోటప్ప తిరునాళ్ల.. కొండంత ఆనందం

- రూ.51లక్షల నిధులతో సౌకర్యాలు
- విద్యుద్దీపకాంతుల్లో మెరిసిపోతున్న రహదారులు



తిరునాళ్ల సందర్భంగా రంగులు, విద్యుత్ కాంతుల మధ్య వెలిగిపోతున్న మెయిన్‌బజారులోని శివునిబొమ్మ

నరసరావుపేట: రాష్ట్ర పండగ కోటప్పకొండ తిరునాళ్లకు పట్టణం ముస్తాబైంది. పగలు ప్రత్యేక రంగులు, రాత్రిళ్లు రంగు రంగుల విద్యుత్ లైట్లతో ప్రధాన రహదారులు, ఫ్లై ఓవర్లు వెలిగిపోతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సుమారు రూ.51లక్షల పురపాలక నిధులతో కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న శివునిబొమ్మ ఐలాండ్‌ను రంగులు వేసి పూలతో తీర్చిదిద్ది రాత్రిపూట ప్రత్యేకంగా కన్పించేలా డిజిటల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. భక్తులు శివుడి బొమ్మను దర్శించుకొని పూజలు చేస్తున్నారు. సెంట్రల్ డివైడర్లు, ఫ్లై ఓవర్లకు రంగులు వేశారు. వాటిపై రంగు రంగుల కాంతులతో ఇల్యూమినేషన్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 60మంది ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి ప్రధాన రహదారులన్నింటిలో ఎటువంటి చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. సుదూర ప్రాంతాల నుంచి పట్టణం గుండా కోటప్పకొండకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం నాలుగు చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు, ఎనిమిది ప్రదేశాల్లో తాగునీటి చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణం నుంచి కొండకు వెళ్లే మార్గంతో పాటు అన్నీ ప్రధాన రహదారుల్లో ఉన్న వీధిలైట్లు, హైమాస్ట్‌లైట్లలో వెలగని వాటిని గుర్తించి నూతన లైట్లను ఏర్పాటు చేశారు. ప్రభలు వెళ్లే మార్గంలో రోడ్లకిరువైపులా అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి మార్గం క్లియర్ చేశారు. ఈ పనులు చేసేందుకు పురపాలకసంఘంలోని ఇంజనీరింగ్ విభాగం రూ.34లక్షలు వెచ్చిస్తుండగా, పారిశుద్ధ్య విభాగం రూ.17లక్షలు ఖర్చుచేస్తుంది.

15 టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేసిన ఆర్టీసీ..

భక్తులు కోటప్పకొండకు వెళ్లి తిరిగి బస్సుల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు కావాల్సిన టికెట్లు ఇచ్చేందుకు 15 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి వెల్లడించారు. డిపో వద్ద ఐదు, కొండ కింద మూడు, కొండపైన రెండు, కొండ కింద చిలకలూరిపేట వైపు వెళ్లేందుకు మూడు, వినుకొండ, అద్దంకి వెళ్లేందుకు మరో రెండు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. టికెట్ చార్జీలు గతేడాది మాదిరిగానే ఉంటాయన్నారు. మొత్తం మీద 1300మంది అధికారులు, సిబ్బంది తిరునాళ్ల కోసం పనిచేస్తున్నారన్నారు.

కొండ పండగ మొదలైంది

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలో కొండ పండగ మొదలైంది. మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండ శైవక్షేత్రం త్రికోటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించే తిరునాళ్ల పండగ వాతావరణం గురువారం నుంచే పట్టణంలో కనిపిస్తున్నది. మహాశివరాత్రి ముందు వచ్చే ఏకాదశిని పురస్కరించుకొని శైవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ చిన్నారులతో మొక్కుబడుల ప్రభలను తీసుకొని పాతూరు శివాలయానికి విచ్చేసి పూజలు జరిపారు. పట్టణ ప్రధాన వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహాశివరాత్రి పర్వదినాన కొండకు తరలివెళ్లేందుకు ప్రభలను సిద్ధం చేస్తున్నారు. ప్రభల నిర్వాహకులు చేసే సందడి, తీన్‌మార్ డప్పు మోతలతో తిరునాళ్ల వాతావరణం కనిపిస్తున్నది. గుమ్మడికాయలు, ప్రభ కలశాలు, ప్రభల బండి, అలంకరణ సామాగ్రి ఊరేగింపులతో మూడురోజుల ముందుగానే తిరునాళ్ల సందడి నెలకొంది.



ఫ్లైఓవర్‌పై విద్యుద్దీప కాంతులు



పాతూరులోని భీమలింగేశ్వరస్వామి



మొక్కుబడి ప్రభను శివాలయానికి తీసుకువెళుతున్న చిన్నారులు

మహాశివరాత్రి పూజలకు కోటేశ్వరస్వామి ఆలయం సిద్ధం



శివరాత్రి వేడుకలకు సిద్ధమైన చిరుమామిళ్ల కోటేశ్వరస్వామి ఆలయం

నాదెండ్ల: చిరుమామిళ్ల గ్రామంలో కొలువైయున్న కోటేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయింది. ఈ నెల 18న జరగనున్న పండుగను పురస్కరించుకుని ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. లింగోద్భావ సమయంలో అభిషేకాలు, అర్చనలు జరపటంతో పాటూ గ్రామ ప్రభలు ఏర్పాటు చేయనున్నారు. రాత్రి కోలాటం, భజన కార్యక్రమాలు, భారీ అన్నదానానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త కొల్లిపర శ్రీనివాసరావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శివారెడ్డి తెలిపారు. ఆలయానికి రంగులు వేసి తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఇళ్ల వద్దకు రేషన్ రాకపోతే సమాచారం ఇవ్వండి

నరసరావుపేట: రేషన్ బియ్యం, ఇతర నిత్యావసరాలు పంపిణీ చేసేందుకు ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ఇళ్లవద్దకు రాకపోతే టోల్‌ఫ్రీ నంబరు 1902, లేదా తమ నెంబరుకు ఫోన్‌చేసి తెలియచేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి జి.మోహన్‌బాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి ఎండీయూ ఆపరేటర్‌కు కేటాయించిన కార్డులను 16రోజులకు విభజించి రూటు వారీగా ప్రణాళిక తయారు చేయించామన్నారు. గత రెండేళ్ల నుంచి ఇదే పద్ధతి అవలంభించటం వలన ప్రతి లబ్ధిదారుడికి ఎండీయూ ఆపరేటర్ వచ్చే తేదీ, సమయం తెలుస్తుందన్నారు. వార్డు వలంటీరుకు సమయం తెలియచేయాలని ఆపరేటర్‌కు చెప్పామన్నారు. ఒకచోటనే ఆపి సరుకులు పంపిణీ చేయొద్దని ఆపరేటర్‌కు పలుమార్లు చెప్పటం జరిగిందన్నారు. కార్డులో సభ్యుల వేలిముద్ర లేకుండా సరుకులు ఇవ్వటం సాధ్యంకాదు కనుక ఎండీయూ ఆపరేటర్ ఇంటివద్దకు వచ్చే సమయానికి ఒకరు ఇంటివద్ద ఉండి రేషన్ తీసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి మాసానికి సంబంధించి ఇప్పటివరకు 86శాతం మందికి పంపిణీ చేశామన్నారు. పంపిణీలో అవకతవకలకు పాల్పడిన పలువురు ఎండీయూ ఆపరేటర్లను సస్పెండ్ చేయటం జరిగిందన్నారు.

సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ బాబురావు



పెండెం బాబూరావు



కళ్ళం శివరామిరెడ్డి

సత్తెనపల్లి: సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, దళిత నాయకుడు, ఉమ్మడి ఏపీ కనీస వేతనాల బోర్డ్ మాజీ మెంబర్ పెండెం బాబురావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ గౌరవ చైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైస్ చైర్మన్‌గా ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన కళ్ళం శివరామిరెడ్డి, డైరెక్టర్లుగా షేక్ మస్తాన్‌బీ (సత్తెనపల్లి), దుగ్గెంపూడి రఘురామిరెడ్డి (పెదమక్కెన), ఆళ్ల జగన్నాథం(నందిగామ), కామినేని వెంకటప్పయ్య(ధూళిపాళ్ల), గంగూరు విజయ లక్ష్మి(గుజ్జర్లపూడి), మారుబోయిన మల్లమ్మ (కంకణాలపల్లి), బత్తుల వెంకాయమ్మ (కుందురువారిపాలెం), మేడ సామ్రాజ్యం(చాగంటివారిపాలెం), ప్రత్తి అప్పారావు (గోళ్ళపాడు), గొర్రెపాటి ఉదూరయ్యా (రుద్రవరం), దేవరశెట్టి రవికుమార్ (సత్తెనపల్లి), బచ్చు వరలక్ష్మి (సత్తెనపల్లి), షేక్ జానమ్మ (సత్తెనపల్లి)తో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, మార్కెటింగ్ ఏడీ, వ్యవసాయ శాఖ ఏడీ, ముప్పాళ్ల పీఏసీఎస్ ప్రెసిడెంట్‌లను నియమించారు. ఈ సందర్భంగా పెండెం బాబురావు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ చరిత్రలో దళిత సామాజిక వర్గానికి చైర్మన్‌గా అవకాశం రావడం ఇదే మొట్ట మొదటిసారి అన్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవతో పదవీ లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇది పేద వర్గాలకు దక్కిన గౌరవమని, నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందనడంలో ఈ నియామకం తార్కాణమన్నారు. తనపై ఎంతో నమ్మకంతో అవకాశం కల్పించిన మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. బాబూరావు నియామకం పట్ల పలువురు నాయకులు, అధికారులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

విజ్ఞానానికి పుస్తక పఠనం తప్పనిసరి



విశాలాంధ్ర సంచార పుస్తక వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ రఘుపతి

సత్తెనపల్లి: విజ్ఞానం కోసం పుస్తక పఠనం తప్పనిసరి అని పట్టణ ఎస్ఐ ఎ.రఘుపతి పేర్కొన్నారు. పట్టణంలోని లూథరన్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన విశాలాంధ్ర సంచార పుస్తక వాహనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. విశాలాంధ్ర బుక్ హౌస్ ఇన్‌చార్జి కె.గురుప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు సంచార పుస్తకాలయం లూథరన్ చర్చి వద్ద పాఠకులకు అందుబాటులో ఉంటుందన్నారు. సీపీఐ నియోజకవర్గ భాద్యుడు యిర్మీయా, వాహన భాద్యులు వి.అజయ్ కుమార్, వై.సుధాకర్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

త్రికోటేశ్వరున్ని దర్శించుకున్న మాజీ మంత్రి కాసు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కాసుకు ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకస్వాములు తీర్థప్రసాదాలు అందజేశారు.

పౌష్టికాహారం పంపిణీకి ఆర్థికసాయం

యడ్లపాడు: పదో తరగతి పరీక్షలకు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఇడపలపాటి చంద్రయ్య కోరారు. మండలంలోని సందెపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 20 మందికి పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈమేరకు చంద్రయ్య రూ.10వేల నగదు పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాసరావుకు అందజేశారు.కార్యక్రమంలో గ్రామీణ వైద్యుడు కేవీ హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జయవెంకటాద్రి హాస్పటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



హాస్పటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని పల్నాడు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జయ వెంకటాద్రి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌ను స్థానిక శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, హాస్పటల్ యాజమాన్యం పాల్గొన్నారు.

పశుదాణామృతం పంపిణీ

మాదల(ముప్పాళ్ళ): పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై అందించే పశు దాణాను గురువారం పంపిణీ చేశారు. మాదల పశు వైద్యశాల పరిధిలో గ్రామాల పాడిరైతులకు పశు దాణామృతం అందించినట్లు పశువైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి తెలిపారు. మొత్తం 25 మెట్రిక్ టన్నుల దాణా పంపిణీ చేయడం జరిగిందన్నారు. పశుదాణామృతం అసలు ధర కేజీ రూ.18 అయితే 75% రాయితీతో రైతుకు రూ.6.50లు చొప్పున అందించడం జరుగుతుందన్నారు. ఒక్కో రైతు1.8 టన్నులు తీసుకోవచ్చని తెలిపారు. కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రంలో గానీ, పశు వైద్యశాలలో సంప్రదించాలని చెప్పారు.

'ప్రభ'వించిన వైభవం

భారీ విద్యుత్ ప్రభలకు గ్రామోత్సవం



ముస్తాబైన అమీన్‌సాహెబ్ పాలెం గ్రామ ప్రభ

నాదెండ్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామ భారీ విద్యుత్ ప్రభలు సిద్ధమయ్యాయి. గత నెలరోజులుగా గ్రామస్తులు ప్రభల నిర్మాణంలో నిమగ్నమయ్యారు. గురువారం రెండు ప్రభలకు రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఒక్కో ప్రభ 90 అడుగుల ఎత్తుతో సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. 17వ తేదీన ఉదయం ప్రభలు శైవక్షేత్రం కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి సన్నిధికి బయలుదేరతాయి. 18వ తేదీ ఉదయం కల్లా కోటప్పకొండ వద్ద నిర్దేశిత ప్రాంతానికి చేరుకోనున్నాయి. పండుగ రోజు రాత్రి దేదీప్యమానంగా విద్యుత్ కాంతులతో ప్రభలు వెలిగిపోనున్నాయి. ప్రభల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి, అనంతరం 19వ తేదిన ఉదయం తిరిగి స్వగ్రామాలకు బయలుదేరనున్నాయి. తిరిగి మరోసారి ప్రభలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు

బొల్లాపల్లి: వేసవిలో నీటిఎద్దడి నివారణకు తగు చర్యలు తీసుకుంటామని గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈఈ ఆర్.ఎస్.హెచ్.హెచ్.కుమార్‌రాజు తెలిపారు. మండలంలోని నీటి ఎద్దడి నెలకొన్న గ్రామాలను గురువారం సందర్శించి గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మండలంలోని గండిగనుమల, రేమిడిచర్ల, అయ్యన్నపాలెం, గుమ్మనంపాడు, మన్నేపల్లి తండా, దోమలగుండం తదితర పంచాయతీల్లో నీటి సమస్యను గుర్తించామన్నారు. ఆయా గ్రామపంచాయతీల్లో సమస్య పరిష్కారానికి ట్యాంకర్ల ద్వారా సరఫరా జరిగేవిధంగా త్వరలో నీటి సరఫరా చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు గ్రామాలను పరిశీలించామని, త్వరలో నీటి ఎద్దడికి తగు చర్యలు ఉంటాయన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ పి.సురేష్, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

రేపు మహాశివరాత్రి ప్రత్యేక పూజలు



వివరాలు వెల్లడిస్తున్న హిమాలయ గురూజీ

వినుకొండ టౌన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణ, విఠంరాజుపల్లి గ్రామశివారులోని సాయిబాబా ఆలయం వద్ద హిమాలయ గురువుల ఆధ్వర్యంలో ఈ నెల 18న ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వినుకొండ శాంతి ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు గురువారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హిమాలయ గురూజీ మాట్లాడుతూ పర్వదినంరోజు గోపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సామూహిక శివపూజ, రుద్ర హోమం, మృత్యుంజయ హోమం, మహా పుర్ణాహుతి, హిమాలయ భక్త బృందంచే కోలాటం, పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, మహా శివునికి వెయ్యి బిందెలతో జలాభిషేకం, క్షీరాభిషేకం, లక్ష బిల్వార్చన, అఘోరభస్మ పూజ అనంతరం భక్తులచే శివలింగానికి అన్న సమర్పణ కార్యక్రమాలు స్వామివారికి నిర్వహిస్తున్నామన్నారు.

అర్హులందరికీ రుణాలు అందజేస్తాం



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సీతారామయ్య

శావల్యాపురం: మత్స్య శాఖ ద్వారా అర్హత కలిగిన మహిళలందరికీ రాయితీ రుణాలు మంజూరు చేయటానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు, గ్రామసమాఖ్య సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు అభ్యున్నతి ఫిష్-ఆంధ్ర, ఫిట్-ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చేపలు, మటన్, చికెన్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే లబ్ధిదారులకు 40 శాతం రాయితీపై బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తామన్నారు. అర్హత కలిగిన మహిళ లబ్ధిదారులను గుర్తించి వారి జీవనోపాధుల మెరుగుదలకు ప్రభుత్వపరంగా ఆర్థిక చేయూత నిస్తుందన్నారు. రుణాలు తీసుకున్న లబ్ధిదారులు తప్పనిసరిగా యూనిట్స్ ఏర్పాటు చేయాలని తదుపరి రాయితీ నగదు ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈకార్యక్రమంలో మత్స్య శాఖ నియోజకవర్గ అధికారి పునుగోటి నాగకిరణ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, సీసీలు ఖాజావలీ, బేబిరాణి,రమాదేవి ఉన్నారు.

టీడీపీ నేతలకు అప్పుడే ఓటమి భయం పట్టుకుంది

- ఓట్లు ఏవిధంగా తొలిగిస్తారో తెలుసుకోకుండానే దీక్షలు చేయడం విడ్డూరం
- వైఎస్సార్ సీపీ మండల నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఈపూరు: తెలుగుదేశం పార్టీ నేతలకు అప్పుడే ఎన్నికల భయం పట్టుకుందని వైఎస్సార్ సీపీ ఈపూరు మండల అధ్యక్షుడు కోపెల దేవరాజ్ అన్నారు. ఈపూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వైఎస్సార్ సీపీ వారు ఓట్లు తొలగిస్తున్నారని టీడీపీ వారు చేసిన ధర్నా అర్థం పర్థం లేనిదని, అసలు ఓట్లు ఏ విధంగా తొలగిస్తారో తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని, కనీస అవగాహన లేకుండా అధికార వైఎస్సార్ సీపీపై లేనిపోని అభండాలు వేస్తున్నారని అన్నారు. ఫారం -7 దరఖాస్తు చేసిన అనంతరం వాటిపై విచారణ జరిగిన తరువాతనే ఓట్లు తొలగిస్తారన్న కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. వినుకొండలో జీవీ ఆంజనేయులు, రాష్ట్రంలో చంద్రబాబు దృష్టిలో పడాలని ఈపూరులో టీడీపీ నాయకులు నానాఅవస్థలు పడుతున్నారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మీరు చేసిన అక్రమాలు, ఓట్లు తొలగింపు కార్యక్రమాలు మేము చేయమని, అలాంటి తప్పుడు ఆలోచనలు మాకు లేవని ఆయన అన్నారు. విదేశాలకు వెళ్లిన వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తీసేస్తారని, బతికున్న వారి ఓట్లు తీసేయడానికి ఎవరూ ముందుకురాని, ఒక వేళ ఓట్లు తీసేస్తే ఎవరు దరఖాస్తు చేశారో, ఎవరు విచారణ చేశారో వివరాలు ఉంటాయని, అవి తెలుసుకొని మాట్లాడాలన్నారు. నాయకుడు శాకమూరి బుచ్చయ్య మాట్లాడుతూ నిజాలు తెలియకుండా టీడీపీ వారు నానాయాగీ చేస్తున్నారని, పద్ధతులు మార్చుకోవాలన్నారు. గోలి ఏడుకొండలు, మూలె అంకిరెడ్డి, గోలి వెంకటేశ్వర్లు, పల్లమీసాల చెంచయ్య, గోపు వీరయ్య పాల్గొన్నారు.

కోటప్పకొండకు 120 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

చిలకలూరిపేటటౌన్: కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని డిపో మేనేజర్ ఎస్ రాంబాబు చెప్పారు. కోటప్పకొండ వెళ్లే ప్రయాణికుల కోసం ఈ ఏడాది 120 బస్సులు ఏర్పాటు చేసినట్లు, ఇందుకు 800 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు వివరించారు. గత ఏడాది తిరునాళ్ల సందర్భంగా 50వేల మందికి పైగా ప్రయాణికులను పేట డిపో నుంచి తరలించినట్లు, ఈ ఏడాది లక్ష మంది ప్రయాణికులు కోటప్పకొండకు వస్తారని అంచానా వేస్తున్నట్లు తెలిపారు. కోటప్పకొండకు వెళ్లటానికి పురుషోత్తమపట్నం నుంచి పోతవరం, మద్దిరాల, యడవల్లి, యూటీ మీదగా, తిరిగి వచ్చే క్రమంలో కట్టుబడివారి పాలెం, చెరువురోడ్డు మీదుగా పట్టణానికి చేరుకొనేలా బస్సు రూట్లను నిర్దేశించినట్లు వివరించారు. ఆర్టీసీ బస్సులో ప్రయణించే వారిలో పెద్దలకు రూ. 30, పిల్లలకు రూ. 15గా టికెట్ ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని సూచించారు.